క్లుప్తంగా

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఎంపీని కోరిన మాజీ కౌన్సిలర్లు



ఎంపీ బీబీపాటిల్‌ను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్లు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మాజీ కౌన్సిలర్లు ఎంపీ బీబీపాటిల్‌ను కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ నేతలు రాములు నేత, జహంగీర్, మోతిరాం, అబ్దుల్లాలు సోమవారం కలిశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఇళ్ల ప్లాట్లు వేసి అర్హులైన పేదలకు పంచాలన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం రూ. 3 లక్షలు మంజూరి చేయాలని కోరారు. ఎంపీకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఎంపీ స్పందిస్తూ పట్టణంలో ప్రభుత్వ స్థలం ఉంటే తన దృష్టి తీసుకరావాలని మాజీ కౌన్సిలర్లకు సూచించారు.

క్రీడాకారిణికి సన్మానం



శివానిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సిర్గాపూర్‌కు చెందిన ఏశబోయిన శివాని హర్యానాలోని కర్నాడలో నిర్వహించనున్న అండర్-17 జాతీయస్థాయి కబడ్డీ ఛాపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సోమవారం ఆమెను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో ప్రతిభ చూపేవారికి తన సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు యాదవ్, రాజునాయక్, శివన్న, సాయిబాబ పాల్గొన్నారు.

సాయిబాబ ఆలయంలో డీఎస్పీ పూజలు



డీఎస్పీని సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్తలు

నారాయణఖేడ్: డీఎస్పీ బాలాజీ నాయక్ సోమవారం కనుమ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని సాయిబాబ ఆలయాన్ని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్పీకి ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికారు.

ఖేడ్‌లో బసవ క్రాంతి



జెండా ఎగురవేస్తున్న ఆనంద్ స్వరూప్ షెట్కార్

నారాయణఖేడ్: సంక్రాంతినాడు వీరశైవ లింగాయత్‌లు బసవక్రాంతిని నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం ఖేడ్‌లోని బసవేశ్వర చౌక్‌లో వీరశైవలింగాయత్ సమాజ్ ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు ఆనంద్ స్వరూప్ షెట్కార్ బసవపతాకాన్ని ఎగురవేశారు. వీరశైవలింగాయత్ సమాజ్ ఇతర బాధ్యులు శంకర్‌రావుపటేల్, శంకరయ్యస్వామి, వీర్‌శెట్టి, శివకుమార్, జగదీశ్, శాంతయ్యస్వామి, గురప్ప, సంజీవ్, రాజశేఖర్, మహాదేవ్, శరణప్ప, లింగాయత్‌లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగి మృతితో విషాద ఛాయలు

జోగిపేట(అందోల్): తాలెల్మ గ్రామ అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ఒగ్గు బాలయ్య (50) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు. దీంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. జోగిపేటకు చెందిన బాలయ్య కొమురెల్లి మల్లన్న దేవాలయానికి దర్శన నిమిత్తం బైకుపై వెళుతుండగా నాచారం సమీపంలో పాల వాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం రావడంతో స్థానికంగా బంధువులు, మిత్రులు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటికి తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ బాలయ్య, మాజీ ఎంపీటీసీ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి.శివశేఖర్, విద్యుత్ శాఖ ఉద్యోగులు నివాళులు అర్పించారు.

ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదలలోని ప్రజలు సంక్రాంతి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వాకిట్లో రంగురంగుల ముగ్గులను వేశారు. యువకులు, చిన్నారులు గాలిపటాలను ఎగురవేశారు.

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలో భోగి, మకర, సంక్రాంతి, కనుమ పండుగలను నిర్వహించారు. ఇళ్ల ముందు రంగు రంగులతో ముగ్గులు వేశారు.

ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు

పట్టణంలోని అయ్యప్ప దేవాలయం, మహంకాళీ దేవాలయం, రేణుక ఎల్లమ్మ దేవాలయం, రుద్రారం గ్రామ సమీపంలోని గణేష్ గడ్డ దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సదాశివపేటలో

సదాశివపేట(సంగారెడ్డి): సంక్రాంతి పండుగ సందర్భంగా యువకులు గాలిపటాలను ఎగురవేశారు. మహిళలు ఇంటి వాకిళ్ల ముందు రకరకాల ముగ్గులు వేశారు. గాలిపటాట దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇండ్లముందు రంగురంగులతో ముగ్గులు వేశారు. చిన్నా,పెద్దా అంతా కలిసి పతంగులు ఎగురవేశారు. చింతల చేరు, లింగపూర్, రెడ్డిఖానాపూర్‌లలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబటి సుధాకర్, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి అర్జున్, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి గౌడ్, నాయకులు చర్ల మనిదీప్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): పట్టణంలో భోగి, మకర సంక్రాంతి, కనుమ పండగలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకున్నారు. కొందరు నోములు నిర్వహించి పిండి వంటలు చేసుకున్నారు. చిన్నా, పెద్ద, కుల, మతాలకు అతీతంగా గాలిపటాలను ఎగురవేశారు.



సంగారెడ్డిలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని గ్రామాల్లో మకర సంక్రాంతి, సోమవారం కనుమ ఘనంగా జరుపుకొన్నారు. బాలికలు, యువతులు, మహిళలు తమతమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో సంప్రదాయ బద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులతో అందంగా అలంకరించారు.

సంగారెడ్డి టౌన్: సంక్రాంతి పురస్కరించుకొని పల్లెల్లో, పట్టణాల్లో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ గాలిపటాలు ఎగురవేశారు. ఇళ్ల ముందు మహిళలు ముగ్గులు వేశారు.

నారాయణఖేడ్: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మహిళలు నోములు నోచుకున్నారు. పట్టణంలోని లలితాంబిక దేవి సన్నిధిలో శాస్త్రోక్తంగా సంక్రాంతి నోములు నోముకున్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు.

రామచంద్రాపురం(పటాన్ చెరు): పండగను పురస్కరించుకొని రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు యువకులు, నాయకులు గాలిపటాలను ఎగురవేశారు.



బర్దిపూర్ గ్రామంలో పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలంటూ వేసిన ముగ్గు



ఖేడ్‌లో ముగ్గు వేస్తున్న బాలిక



భవనంపై పతంగులు ఎగురవేస్తున్న యువకులు



జోగిపేటలోని కాలేజీ రోడ్డులో ముగ్గులు వేసిన దృశ్యం



సంగారెడ్డిలో ముగ్గు వేస్తున్న దృశ్యం



సంగారెడ్డిలో ముగ్గులు వేస్తున్న మహిళ



ముగ్గు వేస్తున్న మహిళలు

మంత్రి హరీశ్ రావును కలిసిన ఎంపీ



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్: ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్ రావును జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి స్వీటు తినిపించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌యూసి సభ్యుడు షేక్ ఫరీద్, బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. సోమవారం జహీరాబాద్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ఎంపీ బీబీ పాటిల్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణం కోసం పేదలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రాములు నేత, మోతిరాం, జహంగీర్, అబ్దుల్లా, బీఆర్ఎస్ నాయకుడు అక్రం పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా శ్యామ్

జహీరాబాద్: టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుడిగా జహీరాబాద్‌కు చెందిన శ్యామ్ నియమితులయ్యారు. 13, 14తేదీల్లో జరిగిన మహా సభలో శ్యామ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై తమ యూనియన్ పోరాటం చేస్తుందన్నారు.

సోనీబాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో బొలెరో వాహనం ఢీకొని సీతారాంతండాకు చెందిన హాస్టల్ అటెండర్‌గా పనిచేస్తున్న సోనీబాయి మృతి చెందినందున ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్ నాయక్ కోరారు. సోనీబాయి అంత్యక్రియలు ఆదివారం సీతారాం తండాలో వైకుంఠధామంలో నిర్వహించగా అంత్యక్రియల కోసం ప్రభుత్వ పరంగా రూ.20వేలను వసతిగృహ సంక్షేమ అధికారిణి బాలమణి అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ సోనీబాయి భర్త శామ్యానాయక్ తెలంగాణ ఉద్యమంలో భాగంగా స్వరాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానం చేశాడని అన్నారు. దీంతో ప్రభుత్వం సోనీబాయికి ఉద్యోగం కల్పించిందని గుర్తు చేశారు. నెలక్రితం సోనీబాయి పెద్దకుమారుడు సైతం ఆత్మహత్యకు పాల్పడగా సోనీబాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం అని తెలిపారు.



నివాళులు అర్పిస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలి



తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం కోరుతుందన్నారు. ఏరియా కమిటీ సభ్యులు రమేష్‌గౌడ్, భూషణం, యెసోబు, కుమార్, పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పతంగుల దుకాణాల్లో తనిఖీలు



పతంగుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అటవీశాఖ అధికారులు

నారాయణఖేడ్: పట్టణంలో సోమవారం పతంగుల దుకాణాలను అటవీశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పతంగులను ఎగురవేయడానికి చైనామాంజాల వినియోగాన్ని నిషేధించారు. పక్షులకు, రోడ్లపై వెళ్లే వాహన దారులు, పాదాచారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారని చైనా మాంజా వినియోగాన్ని అరికట్టారు. దీంతో ఎవరైనా దుకాణాదారు చైనా మాంజా విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి శంకర్, రాములు, సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.

గాలిపటాల విక్రయకేంద్రాలపై దాడులు

జోగిపేట(అందోల్): సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గాలిపటాల విక్రయ కేంద్రాలపై ఫారెస్టు అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. గాలిపటాలను ఎగరవేసేందుకు వినియోగిస్తున్న చైనా మాంజాల వల్ల పక్షులు, వినియోగదారులు ప్రమాదానికి గురవుతున్నందునా దాడులు నిర్వహించి మాంజాలను స్వాధీన పరుచుకుంటున్నట్లు ఫారెస్టు బీట్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. జోగిపేట ఎస్ఐ సామ్యానాయక్ ఆధ్వర్యంలో గాలిపటాల విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. స్థానికంగా విక్రయిస్తున్న చైనా మాంజలను స్వాధీనపరుచుకున్నారు.

క్రీడలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రూరల్ సీఐ వెంకటేశం

న్యాల్‌కల్(జహీరాబాద్): క్రీడలు ప్రశాంతంగా స్నేహ పూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని రూరల్ సీఐ సోముల వెంకటేశం సూచించారు. రేజింతల్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. జహీరాబాద్ జట్టు విజేతగా నిలువగా, బుర్దీపాడ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు నగదుతో పాటు ట్రోఫీని సీఐ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన వారు గర్వ పడకుండా, ఓడిన వారు నిరుత్సాహ పడకుడదన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విజత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ వెంకటేశం తదితరులు

మంత్రిని కలిసిన గౌడ కులస్తులు



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో గౌడ కులస్తులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ శివారులోని హరిత హోటల్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సన్మానించారు. గౌడ కులస్తుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధచూపాలని వారు మంత్రిని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల గౌడ కులస్తులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా

చిన్నకోదూరు(సిద్దిపేట): విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు, రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పెద్దకోడూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ, ఆర్టిజన్ చాలా కీలకమన్నారు. పోరాటాలు చేసి పీఆర్సీ సాధించుకుందామన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై యూనియన్ నిరంతరం పోరాడుతుందన్నారు. ఎస్ఈ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు విద్యుత్ ఉద్యోగులు, మీటర్ రీడర్స్ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌రెడ్డి, నరేష్, శ్రీనివాస్, కృష్ణ, రాజేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆ పార్టీ నాయకులు, బయ్యారం మాజీ ఎంపీటీసీ నర్సింలు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ పరుగులు పెట్టిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న పథకాలను శ్రీకారం చుడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు చుట్టుపక్కల ప్రక్కల గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించేలా రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నట్లు చెప్పారు.

భాషా పండితులకు న్యాయం చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భాషా పండితుల అప్‌గ్రేడేషన్ పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని అప్‌గ్రేడేషన్ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశమై మాట్లాడారు. బద్దిరాజు, భైరారెడ్డి తదితరులు మాట్లాడుతూ కోర్టు కేసుల కారణంగా తమను పక్కన పెట్టడడం సరికాదన్నారు. తెలుగు మహాసభల సమయంలో సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రాయికోడ్(అందోల్): పీపడ్‌పల్లి గ్రామంలో స్థానిక భవానీ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేత జట్టుకు రూ.25,000లు, రెండవ, మూడవ స్థానాలకు రూ.12,000, రూ.6,000ల నగదుతో పాటు మెమోంటోలను అందజేశారు. ముగింపు వేడుకలకు హాజరైన హోప్ న్యూరో హాస్పిటల్ యమ్‌డి కృష్ణమూర్తి మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బసిలింగప్ప, లింగప్ప, నర్సింగ్‌రావు, నర్సింలు, రాజప్ప, రవికుమార్, బక్కప్ప తదితరులు పాల్గొన్నారు.



రాయికోడ్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడల పట్ల ఆసక్తి చూపాలి



దాకూరులో ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): క్రీడల పట్ల యువకులు ఆసక్తి చూపాలని, క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని అక్సాన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం డాకూర్ గ్రామంలో ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలతోనే క్రీడా నైపుణ్యత వెలుగులోకి వస్తుందన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కలాలి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నిర్వాహకులు గణేష్, తరుణ్ రాజ్, గ్రామ పెద్దలు మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ అజయ్, యువజన సంఘాల నాయకులు పద్మారావు, ప్రవీణ్, పీఈటీలు కనక ప్రసాద్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రవీందర్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములకు నిత్యావసర సరుకుల పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): బీఆర్ఎస్ దౌల్తాబాద్ పట్టణ అధ్యక్షుడు అజ్మత్ అలీ (అజ్జు) సోమవారం శివస్వాములకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హత్నూర నుంచి శ్రీశైలం వరకు ఆరు రోజుల క్రితం ఆంజనేయులు గురుస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తిమ్మరాశిపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా అజ్మత్ అలీ (అజ్జు)శివస్వాములకు పండ్లు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. శివస్వాములు చేపట్టిన మహా పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు.



నిత్యావసర సరుకులు అందజేసిన అజ్మత్ అలీ

సంక్షిప్త వార్తలు

◆ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడకి చెందిన మోహన్ కుటుంబానికి సోమవారం రూ. 20వేల ఆర్థిక సాయాన్ని చిట్కుల్ సర్పంచ్ నీలంమధు అందించారు. మృతుడి కుటుంబ సభ్యులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు కృతజ్ఞతలు చెప్పారు.

పటాన్‌చెరు: గత నెల అనారోగ్యంతో ఏషియన్ పెయింట్స్ హమాలీ కార్మికుడు కిషన్ నాయక్ మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి ఏషియన్ పెయింట్స్ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రూ.41,500లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం నాయకులు మల్లేష్, రతన్ సింగ్, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది మనోహర్ తెలిపారు.

◆ 'కంటి వెలుగు సద్వినియోగించుకోవాలి'

మునిపల్లి(అందోల్): కంటి వెలుగును సద్వినియోగించుకోవాలని ఎంపీపీ శైలజా శివశంకర్ సోమవారం పేర్కొన్నారు. 18నుంచి మండలంలో కంటి వెలుగు ప్రారంభమవుతుందని తెలిపారు.

◆ 'కంటి వెలుగు'

మునిపల్లి(అందోల్): కంటి వెలుగును సద్వినియోగించుకోవాలని ఎంపీపీ శైలజా శివశంకర్ సోమవారం పేర్కొన్నారు. 18నుంచి మండలంలో కంటి వెలుగు ప్రారంభమవుతుందని తెలిపారు.

కల్హేర్(నారాయణఖేడ్): కంటి వెలుగును పటిష్టంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహరావు తెలిపారు. సోమవారం కల్హేర్ మండల పరిషత్తులో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఎంపీడీఓ సంగ్రామ్, డాక్టర్లు జేబా బేగం, పవణ్‌కళ్యాణ్, ఆస్పత్రి సూపర్‌వైజర్ మాణిక్యం, బీఆర్ఎస్ నాయకులు ఉప్పరి అంజయ్య పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

జహీరాబాద్: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రత్యేక కోర్టు మంగళవారం సమావేశం నిర్వహిస్తుందని ట్రాన్స్‌కో ఏడీఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

◆ 18న క్రికెట్ గోల్డ్ కప్ టోర్నమెంట్ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: 33వ మైత్రీ క్రికెట్ గోల్డ్ కప్ టోర్నమెంట్‌ను పట్టణంలోని మైత్రీ గ్రౌండ్స్‌లో 18న ప్రారంభిస్తారని మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ విన్నర్ జట్టుకు రూ.1,25,000, రన్నర్స్ జట్టుకు రూ.75,000లు ప్రైజ్ మనీ తోపాటు ట్రోఫీని అందజేస్తారని పేర్కొన్నారు.

◆ హౌసింగ్‌బోర్డు కాలనీలో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. మర్చిపోయిన నగర సంకీర్తన సంస్కృతిని కొంత మంది భక్తులు కొన్ని నెలలుగా ముందుకు తీసుకెళ్లుతున్నారు. భక్తులంతా తెల్లవారు జామున హౌసింగ్ బోర్డుకు చేరుకుని వీధుల్లో తిరుగుతూ భగవంతుడి నామస్మరణ చేశారు.